క్లుప్తంగా

హెచ్‌ఎంల బాధ్యతల స్వీకరణ


హెచ్‌ఎంగా బాధ్యతలు స్వీకరించిన రమణమ్మ

దుత్తలూరు: ఉపాధ్యాయ బదిలీల్లో భాగంగా మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలకు నూతన ప్రధానోపాధ్యాయులుగా వచ్చిన వారు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. దుత్తలూరు జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎంగా కే రమణమ్మ, నందిపాడు హెచ్‌ఎంగా టీ దేవకుమార్, ఏరుకొల్లు హెచ్‌ఎంగా ఐ మాధవి, నర్రవాడ హెచ్‌ఎంగా అంజయ్య బాధ్యతలు చేపట్టారు. వీరికి ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్థిక సాయం

ఉదయగిరి: పట్టణంలోని ఇందిరానగర్‌కాలనీలో శనివారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన గాలేటి నవ్య కుటుంబానికి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదేశాల మేరకు స్థానిక టీడీపీ నాయకులు ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. ఎమ్మెల్యే ఫోన్‌లో నవ్య కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అలాగే ఇటీవల మహానాడుకు వెళ్లి వస్తున్న క్రమంలో రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడి తిరుపతిలో చికిత్స పొందుతున్న ఉదయగిరికి చెందిన ఫడ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ పీవీ రమణయ్యను టీడీపీ నాయకులు పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు.

హెచ్‌ఎంకు సన్మానం



ఆత్మకూరురూరల్: ఉపాధ్యాయ బదిలీల్లో భాగంగా మహిమలూరు వీఎస్ఆర్ జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘ అధ్యక్షుడు సోమవరపు భాస్కర్‌రెడ్డి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన్ని సహచర ఉపాధ్యాయులు, గ్రామస్తులు శాలువాలతో సత్కరించారు. అలాగే చెర్లోయడవల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పీవీ రమణయ్య, బట్టేపాడు హెచ్‌ఎంగా భార్గవి బాధ్యతలు చేపట్టారు.

జేవీవీ వైద్యశిబిరానికి విశేష స్పందన

ఆత్మకూరు: పట్టణంలోని షిర్డీ సాయిరామ్ కళాశాల ఆవరణంలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. నెల్లూరు రామచంద్రారెడ్డి ఆస్పత్రి వైద్యులు ఎంపీ రమణయ్య, మెడికవర్ ఆస్పత్రి గుండె వ్యాధి నిపుణులు ఎం బాలకృష్ణ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు చేశారు. మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ షేక్ సందానీ, జేవీవీ నిర్వాహకులు హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మకు పొంగళ్లు



కలిగిరి: మండలంలోని కృష్ణారెడ్డిపాళెంలో పోలేరమ్మకు సామూహిక పొంగళ్ల కార్యక్రమాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం అమ్మవారికి సద్దిని సమర్పించారు. అనంతరం మహిళలు పొంగళ్ల సామగ్రితో ఊరేగింపుగా పోలేరమ్మ ఆలయం వద్దకు చేరుకుని పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించారు. వర్షాలు సంవృద్ధిగా కురిసి పాడిపంటలతో గ్రామం సుభిక్షంగా ఉండేలా చూడాలని వేడుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సోమశిల: అనంతసాగరం మండలం చిలకలమర్రి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ ఎం సురేష్‌బాబు ఆదివారం తెలిపారు. 24 గంటల విద్యుత్ సరఫరాకు సంబంధించిన లైన్ పనులు చేపడుతున్న కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరాను నిలిపివేస్తున్నామని చెప్పారు. వ్యవసాయానికి త్రీఫేస్ విద్యుత్ సరఫరా ఉదయం 6 నుంచి 9 గంటల వరకు ఉంటుందని తెలిపారు.

చంద్రన్నా.. ఉచిత బస్సు ఎప్పుడన్నా?

- ఏడాదిగా మహిళలు నిరీక్షణ
- సూపర్‌సిక్స్ హామీని నెరవేర్చని కూటమి ప్రభుత్వం
- అదిగో..ఇదిగో అంటూ ప్రకటనలకే పరిమితం
- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న మహిళలు



ఆత్మకూరు: ఎన్నికల సమయంలో ఎలాగైనా అధికారంలోకి రావాలని కూటమి నాయకులు సూపర్‌సిక్స్ పేరుతో హామీలను గుప్పించారు. పేదల సంక్షేమమే తమ ధ్యేయమని, తమను గెలిపిస్తే ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేస్తామని ఊదరగొట్టారు. తీరా అధికారంలోకి వచ్చాక పేదలను మరిచారు. సంక్షేమ పథకాల ఊసే ఎత్తకుండా రేపు మాపు అంటూ ప్రకటనలతో ప్రజలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో సూపర్‌సిక్స్ హామీల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని ప్రకటించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎప్పుడు అమలు చేస్తారా అని వారు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. అయితే ఏడాది గడిచిపోతున్నా హామీని అమలు చేయకపోవడంపై మహిళలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వచ్చే ఆగస్టు నుంచి హామీని అమలు చేస్తామని ప్రభుత్వం చెబుతున్నా అప్పుడైనా అమలు చేస్తారో..లేదోనని మహిళలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఆత్మకూరు నియోజకవర్గంలో 1,09,578 మంది మహిళలు

ఆత్మకూరు నియోజకవర్గంలో 1,09,578 మంది మహిళలు ఉన్నారు. వీరిలో కనీసం సగం మంది కిపైగా పేద, దిగువ మధ్య తరగతికి చెందిన మహిళలే ఉన్నారు. వీరంతా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తే ఆర్థిక వెసులుబాటు కలుగుతుందని ఆశపడుతున్నారు. అయితే ఏడాది కావస్తున్నా ఇప్పటి వరకు ఇచ్చిన హామీను నెరవేర్చకపోగా సీఎం చంద్రబాబు తరచూ రాష్ట్ర ఆర్థిక ఇబ్బందుల గురించి మాట్లాడుతుండడంతో పథకం అమలుకు నోచుకుంటుందో..లేదోనని సందేహాన్ని వెలిబుచ్చుతున్నారు.

హామీని నెరవేర్చాలి



ఎన్నికల సమయంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని చంద్రన్న చెప్పారు. మహిళల ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చాక హామీని విస్మరించారు. ఏడాది గడుస్తున్నా అదుగో..ఇదుగో అంటూ మభ్యపెడుతున్నారు. ఇలా మోసం చేయడం తగదు.

–ప్రసన్న, అన్నారెడ్డిపాళెం

మోసం తగదు



ఎన్నికల సమయంలో సూపర్‌సిక్స్ హామీల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని చంద్రబాబు నాయుడు చెప్పడంతో నమ్మాం. ఇప్పుడు ఉచిత బస్సు ప్రయాణం అమలుపై అనుమానం కలుగుతుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఉచిత బస్సు ప్రయాణం హామీని నెరవేర్చకపోవడం దారుణం.

– షేక్ షాహీనా, జెండాదిబ్బ

వైభవంగా గంగమ్మ తిరునాళ్ల



మర్రిపాడు: మండలంలోని గంగపాళెంలో గంగమ్మ తిరునాళ్లను మూడ్రోజులపాటు వైభవంగా నిర్వహించారు. చివరి రోజైన ఆదివారం మహిళా భక్తులు సామూహికంగా గంగమ్మకు పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించారు. గంగమ్మ గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. 15 ఏళ్ల తర్వాత గంగమ్మ తిరునాళ్లను నిర్వహించడంతో గ్రామానికి చెందిన వలసవాసులతో పాటు బంధుమిత్రులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో గ్రామంలో కోలాహలం నెలకొంది.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ మృతి

సంగం: పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మండలంలోని చెన్నవరప్పాడుకు చెందిన నాగలక్ష్మి(35) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. చెన్నవరప్పాడుకు చెందిన నాగలక్ష్మి భర్తతో కలిసి గత కొంత కాలంగా సంగంలోని తిరుమనతిప్పలో నివాసం ఉంటోంది. ఈ నెల 22వ తేదీ భార్యభర్తల మధ్యన చిన్నపాటి ఘర్షణ నెలకొంది. దీంతో మనస్తాపానికి గురైన నాగలక్ష్మి పురుగు మందు తాగింది. గమనించి భర్త తొలుత నెల్లూరులోని వైద్యశాలకు తరలించారు. అనంతరం ఆరోగ్య పరిస్థితి విషమించడంతో చెన్నైకు తరలించారు. ఆ తరువాత ఆరోగ్యపరిస్థితి మెరుగుపడడంతో రెండ్రోజుల క్రితం మళ్లీ నెల్లూరు వైద్యశాలలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ నాగలక్ష్మి ఆదివారం మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదుతో పోలీసులు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు.

విద్యార్థినికి ప్రతిభా పురస్కారం



చేజర్ల మండలానికి చెందిన పదోతరగతి విద్యార్థిని ఉడతా అనూషా మంత్రి కొలుసు పార్థసారథి చేతుల మీదుగా ప్రతిభాపురస్కారం అందుకున్నారు. ఆదివారం నెల్లూరులో యాదవ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు ప్రతిభాపురస్కారాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పదో తరగతి ఫలితాల్లో 594 మార్కులు సాధించిన ఉడతా చినరత్తయ్య కుమార్తె అనూషాను మంత్రి పార్థసారధి అభినందించి ప్రతిభాపురస్కారాన్ని ప్రదానం చేశారు.

వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయాలి


ఆత్మకూరులో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


కలిగిరిలో..


జలదంకిలో..

ఆత్మకూరు: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనను పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వారిని మోసం చేయడాన్ని నిరసిస్తూ ఈ నెల 4న ఆత్మకూరులో నిర్వహిస్తున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. పట్టణంలోని మేకపాటి క్యాంపు కార్యాలయంలో వెన్నుపోటు దినం పోస్టర్లను ఆదివారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019 ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే 90శాతానికిపైగా అమలు చేశారని తెలిపారు. కరోనా విపత్కర పరిస్థితుల్లోనూ సంక్షేమ పథకాలను కొనసాగించారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను నెరవేర్చకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించకుండా రెడ్‌బుక్ రాజ్యాంగంతో ప్రతిపక్ష పార్టీ నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తూ ప్రజలను భయపెట్టేందుకు యత్నిస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చి పిలుపు మేరకు ఎన్నికల హామీలను అమలు చేయని కూటమి ప్రభుత్వాన్ని నిలదీసేందుకు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 10 గంటలకు పట్టణంలోని మున్సిపల్ బస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ చేపడుతున్నట్లు తెలిపారు. పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. పార్టీ రాష్ట్ర మున్సిపల్ విభాగం కార్యదర్శి అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్ ఆదిశేషయ్య, మండలాధ్యక్షులు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, చెన్ను వెంకటేశ్వర రెడ్డి, బిజివేముల పిచ్చిరెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి కొండా వెంకటేశ్వర్లు, పట్టణ ఉపాధ్యక్షుడు ముతీవర్, జిల్లా యాక్టివిస్ట్ సెక్రటరీ పులిమి రమేష్‌రెడ్డి, ఏ కోటిరెడ్డి, నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, సిరిగిరి వెంకటేశ్వర్లురెడ్డి, సయ్యద్ జమీర్‌బాషా, షేక్ పర్వీన్, సుబ్రహ్మణ్యంరెడ్డి, కల్పన, హేమ, కవిత, పాలేటి వెంగళరెడ్డి, జమ్రు, వినోద్, కలాం, గోవర్ధన్, సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వాన్ని నిలదీద్దాం

జలదంకి: ఎన్నికల హామీలను నెరవేర్చకుండా రైతులు, మహిళలను, విద్యార్థులు ఇలా అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన చంద్రబాబు ప్రభుత్వాన్ని నిలదీద్దామని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు ఇస్కా మదన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి వెన్నుపోటు దినం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది పాలనను పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేయడాన్ని నిరసిస్తూ ఈ నెల 4న ఉదయగిరిలో వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. నియోజకవర్గ పార్టీ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు వాకా మాదవరెడ్డి, పబ్లిక్ వింగ్ అధ్యక్షుడు సురె వెంకటశేషారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు తమ్మినేని సతీష్‌నాయుడు, నాయకులు రామాల రమేష్‌రెడ్డి, ఆతిన శ్రీనివాసులు, వాకా శ్రీనివాసులరెడ్డి, కమతం కృష్ణ, వల్లంరెడ్డి బాబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలిగిరి: ఎన్నికల హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వాన్ని నిలదీసేందుకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ఉదయగిరిలో ఈ నెల 4వ తేదీన నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం వారు పార్టీ నాయకులతో కలిసి కలిగిరిలో వెన్నుపోటు దినం కరపత్రాలను అవిష్కరించారు.ఉదయగిరిలో నిర్వహించే కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. నాయకులు పాలూరు కొండారెడ్డి, మూలి రాధాకృష్ణారెడ్డి, కోడూరు కృష్ణారెడ్డి, సానా శ్రీనివాసులురెడ్డి, ప్రసాద్, ఖాజామెయినుద్దీన్, వేమనారాయణ, మస్తాన్‌రెడ్డి, పాల్గొన్నారు.

పసుపు రైతులను ఆదుకోవాలి


పసుపు కొమ్ములను పరిశీలిస్తున్న వెంకటయ్య

ఉదయగిరి: ప్రభుత్వం పసుపు పంటకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కాకు వెంకటయ్య కోరారు. ఆదివారం ఆయన మండలంలోని కొత్తపల్లి, లింగంపల్లి, కృష్ణారెడ్డిపల్లి, తదితర గ్రామాల్లో పర్యటించారు. పొలాల్లో కళ్లాల్లో ఉన్న పసుపు పంటను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేయింబవళ్లు కష్టపడి సాగుచేసిన పసుపు పంటకు గిట్టుబాటు ధరలు లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. రైతులు పంట కోసే సమయంలో క్వింటా ధర రూ.12 వేలు నుంచి రూ.13 వేల వరకు ఉండగా, ప్రస్తుతం రూ.9 వేలు మాత్రమే ఉందన్నారు. ఎకరా పంట సాగుకు పెట్టుబడి రూ.2 లక్షలు అవుతుందన్నారు. ప్రస్తుతం ఉన్న ధరతో రైతులకు పెట్టుబడి నగదు కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. గత ప్రభుత్వంలో క్వింటా రూ.16 వేల వరకు పలికిందని తెలిపారు. రైతు సంక్షేమమే తమ ధ్యేయమని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంలో పసుపు ధరలు పతనం కావడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పసుపు పంటకు మద్దతు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని కోరారు.

ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు హెచ్‌ఎంను నియమించాలి

ఉదయగిరి: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడిని నియమించాలని యూటీఎఫ్ ఉదయగిరి, సీతారామపురం మండల శాఖల నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రెండేళ్ల క్రితం సుమారు 700 మంది విద్యార్థులతో కళకళలాడిన పాఠశాల నేడు ఉపాధ్యాయుల, వసతుల కొరత కారణంగా మూతపడే స్థాయికి చేరుకుందన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం నూతనంగా నిర్మించిన అదనపు తరగతి భవనాలు ఉపయోగంలోకి రాకపోవడంతో విద్యార్థులకు ఉపాధ్యాయులు ఆరుబయట చెట్ల కిందే విద్యాబోధన చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. దీంతోపాటు మరుగుదొడ్లు, నీటి సౌకర్యం లేక, తగినంత మంది సబ్జెక్టు ఉపాధ్యాయులు లేకపోవడంతో ఏడాది కాలంగా విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గుతోందన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడిని నియమించి మౌలిక వసతులు కల్పనకు చర్యలు చేపట్టాలని కోరారు.

చిలకలమర్రి జెడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయుడి ప్రతిభ

సోమశిల: ప్రభుత్వ ఉద్యోగుల్లో వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఐ గాట్ కర్మయోగి వేదిక కార్యక్రమంలో చిలకలమర్రి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన గణిత ఉపాధ్యాయుడు చల్లా చంద్రశేఖర్‌రెడ్డి ప్రతిభకనబరిచారు. ఆయన ఇప్పటి వరకు ఐ గాట్ కర్మయోగి వేదిక ద్వారా వంద కోర్సులను పూర్తి చేశారు. ఈ వేదిక ద్వారా కోర్సులు పూర్తిచేసే వారికి పాయింట్ల ఆధారంగా ప్రతి నెలా 1వ తేదీన ర్యాంకులను ప్రకటిస్తారు. జూన్1న ప్రకటించిన ర్యాంకుల్లో చంద్రశేఖరరెడ్డి 465 పాయింట్లతో జాతీయస్థాయిలో 26వ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా ఆయనకు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

వరికుంటపాడు నూతన ఎంపీడీఓగా నాగూర్‌వలి



వరికుంటపాడు: మండల నూతన ఎంపీడీఓగా నాగూర్‌వలి నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఎంపీడీఓగా పనిచేస్తున్న వేణుగోపాలరావు ఉద్యోగ విరమణ చేశారు. దీంతో డిప్యూటీ ఎంపీడీఓ నాగూర్‌వలిని ఎంపీడీఓగా నియమిస్తూ జెడ్పీ సీఈఓ ఆదేశాలు జారీచేశారు. ఈ మేరకు ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

చికెన్ వ్యర్థాల వాహనం పట్టివేత

సంగం: సంగంలో చికెన్ వ్యర్థాలను అక్రమంగా తరలిస్తున్న మినీవ్యాన్‌ను సంగం పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. అందులోని చికెన్ వ్యర్థాలను స్థానిక కొండ ప్రాంతంలో పూడ్చిపెట్టారు. వాహనాన్ని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేష్ తెలిపారు.

చౌక దుకాణాల వద్దే రేషన్ పంపిణీ


ఆత్మకూరులో రేషన్‌షాపును తనిఖీ చేస్తున్న ఆర్డీఓ బీ పావని


రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి

దగదర్తి: ఇక నుంచి చౌక దుకాణాల వద్దే రేషన్ సరుకులను పంపిణీ చేస్తారని ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకటకృష్ణారెడ్డి పేర్కొన్నారు. కొత్తపల్లి కౌరుగుంట పంచాయతీలోని చౌక దుకాణం వద్ద రేషన్ సరుకుల పంపిణీని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికి రేషన్ పంపిణీ వ్యవస్థ కారణంగా సరుకులు పక్కదారి పట్టాయన్నారు. అందుకే ప్రభుత్వం అవినీతికి తావులేకుండా ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఇకపై ప్రతి నెలా 1 నుంచి 15వ తేదీ వరకు రేషన్ సరుకులు పంపిణీ చేస్తారన్నారు. 65 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు రేషన్ డీలర్లు వారి ఇంటి వద్దకే సరుకులు అందజేస్తారని తెలిపారు. తహసీల్దార్ పీ కృష్ణ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సర్వర్ మొరాయించడంతో ఇక్కట్లు

ఆత్మకూరు: కూటమి ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆత్మకూరు నియోజకవర్గంలోన్ని అన్ని రేషన్ దుకాణాల్లో ఆదివారం నుంచి రేషన్ సరుకుల పంపిణీ ప్రారంభమైంది. తొలిరోజు పట్టణంలోని పలు రేషన్ దుకాణాల్లో సర్వర్ పనిచేయకపోవడంతో గంటల తరబడి లబ్ధిదారులు వేచి ఉన్నారు. పది నిమిషాలు సర్వర్ పనిచేయడం, తిరిగి నిలిచిపోతుండడంతో కొందరు మరుసటిరోజు వస్తామని వెళ్లిపోయారు. కాగా ఆత్మకూరు ఆర్డీఓ బీ పావని చావడి సెంటర్‌లోని రేషన్ దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కాటా, స్టాక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు సర్వర్ పనిచేయని విషయాన్ని ఆర్డీఓ దృష్టికి తీసుకొచ్చారు.

కరెంట్‌పోతే అందని సేవలు



అనంతసాగరం మండలం దేవరాయపల్లి బిట్–1 సచివాలయంలోని ఇన్వర్టర్ మరమ్మతులకు గురవడంతో కరెంట్‌పోతే కంప్యూటర్లు నిలిచిపోతూ ఆన్‌లైన్ సేవలకు అంతరాయం కలుగుతోంది. ఈ సచివాలయానికి నిత్యం ఏడు గ్రామాలకు చెందిన ప్రజలు వివిధ ప్రభుత్వ సేవలను పొందేందుకు వస్తుంటారు. సచివాలయంలోని ఇన్వర్టర్ మరమ్మతులకు గురైనా సిబ్బంది పట్టించుకోకపోవడంతో కరెంట్ లేని సమయంలో ఆన్‌లైన్ సేవలందక ప్రజలు తీవ్ర అవస్థ పడుతున్నారు. ఇప్పటికైనా మండలాధికారులు స్పందించి ఇన్వర్టర్‌కు మరమ్మతులు లేదా నూతన ఇన్వర్టర్‌ను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. – సోమశిల

పనిచేయని జనరేటర్.. నిలిచిపోతున్న సిగ్నల్స్



గండిపాళెంలోని బీఎస్ఎన్ఎల్ సెల్‌టవర్ విద్యుత్ సరఫరా నిలిచిపోతే పనిచేయడం లేదు. సెల్‌టవర్ వద్ద ఏర్పాటు చేసిన జనరేటర్ మరమ్మతులకు గురవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోతే టవర్ నుంచి సిగ్నల్స్ రావడం లేదు. విద్యుత్ సరఫరా వచ్చిన తరువాత కూడా సుమారు అరగంట వరకు సిగ్నల్స్ అందుబాటులోకి రావడం లేదు. దీంతో బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొందరు వినియోగదారులు ఇతర నెట్‌వర్క్‌లకు సైతం మారిపోతున్నారు. మరోవైపు సెల్‌టవర్ చుట్టూ కంపచెట్లు దట్టంగా పెరిగి ఆ ప్రాంతం చిట్టడవిని తలపిస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి జనరేటర్‌కు మరమ్మతులు చేసి వినియోగంలోకి తెచ్చి బీఎస్ఎన్ఎల్ సిగ్నల్స్ సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు. – ఉదయగిరి రూరల్

ప్రైవేట్ జోరు.. ఆర్టీసీ బేజారు


దుత్తలూరు సెంటర్‌లో నిలిచి ఉన్న ప్రైవేట్ వాహనాలు

ఉదయగిరి నియోజకవర్గంలోని పలు మండలాల్లో ప్రైవేట్ వాహనాలు జోరుగా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చుతూ ఆర్టీసీ ఆదాయానికి గండి కొడుతున్నాయి.వింజమూరు బస్టాండ్, దుత్తలూరు సెంటర్, ఉదయగిరి పంచాయతీ బస్టాండ్, కలిగిరి బస్టాండ్ తదితర ప్రాంతాల్లో ఆటోలు, జీపులు, కార్లు, టాటామ్యాజిక్ వాహనాల దందా కొనసాగుతోంది. స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి ప్రైవేట్ వాహనాల జోరుకు కళ్లెం వేయాల్సిన రవాణా, పోలీసు, ఆర్టీసీ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ప్రైవేట్ వాహనదారులు అధిక చార్జీలు వసూలు చేస్తూ ప్రయాణికుల జేబులకు చిల్లు పెడుతున్నారు. – ఉదయగిరి

ట్రాఫిక్ సమస్యతో సతమతం



ఏఎస్‌పేటలోని మెయిన్ బస్టాండ్ సెంటర్‌లో నిత్యం ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. ఏఎస్‌పేట దర్గా సందర్శనకు నిత్యం పర్యాటకులు తరలివస్తుంటారు. బస్టాండ్ సెంటర్‌లో ఆర్టీసీ, ప్రైవేట్ బస్సు సర్వీసులు, ఆటోలతో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉంటుంది. బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో ఆటోలతో పాటు ప్రైవేట్ వాహనాలను నడిరోడ్డుపై అడ్డదిడ్డంగా నిలిపేస్తుండడంతో తరచూ ట్రాఫిక్ నిలిచిపోతూ ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు. పోలీసు అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు. – అనుమసముద్రంపేట